RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 139 | ఏప్రిల్ 25, 2025 | వెల : రూ.3-00



అలరించిన లలిత సంగీత విభావరి

4లో..

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తోంది. ఇటీవల సన్న బియ్యం పథకం కార్యక్రమం ప్రారంభించి జనంలో అభిమానాన్ని పెంచుకుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రేషన్ కార్డు కలిగి ఉన్న మహిళలకు నెలకు రూ.2,500 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ స్కీమ్‌ను ప్రారంభించేందుకు సర్కారు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే అధికారులు లెక్కలు తీశారని విశ్వసనీయ సమాచారం.

### ఆర్థిక భారంతో స్కీమ్ అమలు ఆలస్యం

నల్లగొండ జిల్లాలో 4 లక్షలా 66 వేల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. 'మహాలక్ష్మి' స్కీమ్ లో భాగంగా వైట్ రేషన్ కార్డు యజమానురాలకు నెల నెల రూ.2,500 జమ చేయనున్నారు. అతి త్వరలోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టబోతున్నారని వినికిడి. ఈ పథకంతో జిల్లాలో 3 లక్షల మందికి మహిళలకు లబ్ధి చేకూరనుంది. ఇటీవల మంత్రులు సైతం మహిళలకు మహాలక్ష్మి పథకం అమలు చేస్తామని ఆర్భాటంగా చెప్పారు. దీంతో జిల్లాలో మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా అందించే సహాయం కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రజా పాలనలో మహాలక్ష్మి సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నామని పేర్కొంటున్నారు. పథకం అమలు ఆలస్యం కావడానికి ఆర్థిక భారం అని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

మహాలక్ష్మి పథకంలో ఇప్పటికే రెండు కీలకమైన పథకాలను లబ్ధిదారులు పొందుతున్నారు. టీజీఎస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ రూ.500 వస్తోంది. ఇక మహిళలకు నెలవారీగా రూ.2,500 పథకం మాత్రమే మిగిలి ఉంది. ఈ స్కీమ్‌ను ప్రారంభించాలని మహిళలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపరిచి ఆర్థికంగా తోడ్పాటు లభిస్తుందని అంటున్నారు. ప్రతి నెలా రూ.2,500 అందిస్తే తమ కుటుంబానికి ఆసరా లభిస్తుందని పలువురు మహిళలు అభిప్రాయపడుతున్నారు.



## రూ. 2500 కోసం వెయిటింగ్

'మహాలక్ష్మి' అమలుపై మహిళల ఆశలు

స్కీమ్ ప్రారంభం కోసం ఆసక్తిగా ఎదురుచూపులు

పథకం అమలుకు లెక్కలు తీస్తున్న అధికారులు!



## కలలో కూడా ఊహించని శిక్ష వేస్తాం..

పహల్గాం ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ

వేద న్యూస్, డెస్క్:

ఏప్రిల్ 22న పహల్గాంలోని ప్రముఖ పర్యటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు జరిపిన దాడిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తామని మోదీ హెచ్చరించారు. ఉగ్రదాడికి పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు.

గురువారం బిహార్ మధుబనిలో పంచాయతీరాజ్ దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు.పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించి ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తామని, వారిని మట్టిలో కలిపి సమయం ఆసన్నమైందన్నారు. ఇది పర్యటకులపై జరిగిన దాడి కాదని, భారత్ ఆత్మపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, వెంటాడి భారత్ హతమారుస్తుందని స్పష్టం చేశారు. కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని తెలిపారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయిందని, ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడని అన్నారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయని చెప్పారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రతి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని మోదీ హెచ్చరించారు. అదే సమయంలో భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలిచారని అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలుకొట్టలేరని మోదీ స్పష్టం చేశారు.

## పెండింగ్ కేసులను పూర్తి చేయాలి

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :





పెండింగ్ కేసులు సత్వరమే క్లియర్ చేయాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశించారు. పెండింగ్ కేసులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవా లని కోరారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అ న్నారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పూర్తి పారదర్శకంగా చేయ లన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయా లన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రతి అధికారికి సి.సి.టి.యన్.ఎస్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్ధవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతీ రోజు గ్రామానికి సందర్శించి ప్రజలతో మమేకం అవుతూ నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు.కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి ప్రజా రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన,సత్వర సేవలు అందించాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించాలని పేర్కొన్నారు.ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం, పి.డి.యస్ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రిపీటెడ్‌గా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్‌ను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్పీ మౌనిక, అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు,సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీ నారాయణ, సి.ఐలు, యస్.ఐలు పాల్గొన్నారు.

## గుడుంబా విక్రయిస్తున్న మహిళా అరెస్టు

వేద న్యూస్, శాయంపేట:



శాయంపేట మండలంలోని సూర్య నాయక్ తండాకు చెందిన జర్పుల మంగమ్మ అనే మహిళ పత్తిపాక లో గుడుంబా విక్రయిస్తుంది. దీంతో సమాచారము అందుకున్న పోలీసులు మహిళలను అరెస్టు చేసి ఏడు వేల ఐదు వందల రూపాయలు విలువైన ఇరవై ఐదు లీటర్ల గుడుంబా స్వాధీన పరుచుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.





## భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:

భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు సల్కునూరు ఎక్స్ రోడ్ ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో నేడు (శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు వేములపల్లి తహసిల్దార్ పుష్పలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ఎంపీ రఘువీర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూమి సమస్యలు ఉంటే సమాధానాలు దొరుకుతాయని వివరించారు.

## కుంభమేళాగా బిఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లు..!

వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :



రాష్ట్రంలో మరో కుంభమేళ గా బిఆర్ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయనీ మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ తెలిపారు.గురువారం సూర్యాపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఎల్కతుర్తిలో జరగనున్న టిఆర్ఎస్ రజతోత్సవ సభలో కెసిఆర్ మాటల కోసం అన్ని వర్గాల ప్రజలంతా ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రములో కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని రైతుల పంట పొలాలకు నీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, పండిన కొద్ది పంటను ప్రభుత్వం కొనక రైతులు ధాన్యం తగలబెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నాడు 14 ఏళ్లు ఉద్యమం,పదేళ్లపాటు అభివృద్ధి చేసిన, నేడు 16 నెలలు ప్రతిపక్షంలో ఉన్న తెలంగాణ ప్రజల కోసమే బిఆర్ఎస్ పని చేస్తుందన్నారు. కెసిఆర్ ఇన్నాళ్లు మౌనంగా ఉన్నాడని ఇప్పుడు సభలో ఏం చెబుతాడో మాకు ఏం భరోసా ఇస్తాడో అని ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని అన్నారు. సూర్యాపేట జిల్లా నుంచి 40 వేల మందిని తరలించేందుకు సభకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. అన్ని గ్రామాలు, వార్డుల్లో సమావేశాలు ఏర్పాటు చేసి బిఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని, 16 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని వివరించామన్నారు. సభకు వెళ్లే రూట్ మ్యాప్, పార్కింగ్ సౌకర్యం సిద్ధమవుతుందన్నారు. మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో బండెనక బండి కట్టి 16 బండ్లుగా పయనమైన రైతుల ఎడ్ల బండ్ల కు గ్రామ గ్రామాన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయలేదని దీంతో రేవంత్ పాలనపై దాడి చేసేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని అన్నారు. నేడు కరెంటు కోతలు, రైతులకు నీళ్లు రాక పండిన కొద్ది పంటను కొనక పోవడంతో ఇటీవల గుర్రం తండా వద్ద రైతులు ధాన్యం తగలబెట్టిన సంఘటనను గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకు వస్తే ప్రజలు తిరగబడతారని వారి వద్దకు రావడం లేదని, జిల్లాకు మంత్రిగా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డి ఇప్పటివరకు ఒక్క సమీక్ష కూడా చేయలేదని తెలిపారు బిఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధమవుతున్నా రని ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేసినప్పటికీ సరిపోవడం లేదన్నారు.

ఈనెల 27న జరగనున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్ని వర్గాల ప్రజలు రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, మాజీ జెడ్పిటిసి జిడి బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తతే మేలు

- ఎండలతో తస్మాత్ జాగ్రత్త!
- వడదెబ్బకు గురికాకుండా ముందస్తు చర్యలతో హెల్త్ పదిలం
- వృద్ధులు, చిన్నారులపై స్పెషల్ ఫోకస్ తప్పనిసరి

**వేద న్యూస్, జమ్మికుంట:**

రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. ఏప్రిల్ మాసంలోనే మే నెల నాటి ఎండలు తలపిస్తుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఎండవేడిమికి ఇంటిలోనే ఉక్కపోతకు గురవుతూ.. ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 నుంచే సూర్యుడి ప్రతాపం కారణంగా ప్రజలు దాదాపుగా ఇండ్లలో నుంచి అసలు బయటకు రావడం లేదు. అత్యవసరమైతే వారి పనుల నిమిత్తం వస్తున్నారు. కాగా, ఎండల్లో బయటకు వెళ్లకూడదని, తప్పని సరైతే జాగ్రత్తలు పాటించాలని, లేదంటే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని వైద్యులు సలహాలిస్తున్నారు. ముఖ్యంగా వడదెబ్బ తగలకుండా తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు, ఎండీ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఊడుగుల సురేశ్ పేర్కొన్నారు. ఇంట్లో ఉండే వృద్ధులు, పిల్లలు కూడా వడదెబ్బకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని, వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే.. ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వడదెబ్బ గురించి తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయాలు, ఎలాంటి చర్యలు తీసుకోవాలో 'వేద న్యూస్'కు ప్రత్యేకంగా వివరించారు. ఆ విషయాలు మీ కోసం..

**- వడదెబ్బతో పొంచిన ప్రమాదం**

వడదెబ్బకు గురైన వారి శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్‌కు చేరుకుంటుంది. ఎండలో తిరగడం, తక్కువ నీరు సేవించడం, ద్రవ పదార్థాలు తీసు కోకపోవడం, మద్యం సేవించడంతో వడదెబ్బ తగులుతుంది. అధిక ఎండ శరీరానికి తగిలిన కారణంగా శరీరంలోని ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి నీరు ఆవిరై లవణాలు కోల్పోతారు. శరీరం పొడి బారి.. అపస్మారక స్థితికి చేరుకుంటారు. సమయానికి వైద్యం అందకుంటే తీవ్రత పెరిగి శరీరం నిస్తేజమై ప్రాణం పోయే ప్రమాదం ఉంది.

**వడదెబ్బ అంటే..**

డీహైడ్రేషన్‌కు సంబంధించిన అనారోగ్యం. ఇందులో హీట్ ఎగ్జాషన్, హీట్ ఇంజురీ, హీట్ స్ట్రోక్ అనే మూడు రకాలు ఉంటాయి.

**- హీట్ ఎగ్జాషన్**

హీట్ ఎగ్జాషన్‌లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది.

**- హీట్ ఇంజురీ**

హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

**- హీట్ స్ట్రోక్**

హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

**- ఎవరికి రిస్క్ ఎక్కువ..?**

వడదెబ్బ రెండు రకాలు ఉంటుంది. మొదటిది క్లాసిక్ హీట్ స్ట్రోక్ , రెండోది ఎగ్జాషన్ హీట్ స్ట్రోక్. క్లాసిక్ హీట్ స్ట్రోక్ కారణంగా వృద్ధులు ఎక్కువగా ప్రభావితం అవుతారు. ముఖ్యంగా.. డయాబెటిస్, హైపర్‌టెన్షన్, సిస్టిక్ ఫైబ్రోసిస్, స్లీప్ డిజార్డర్స్, కిడ్నీ, ఊపిరితిత్తులు, మీ శరీర ఉష్ణోగ్రతలను ప్రభావితం చేసే మందులు వేసుకునే వారికి ఈ వడదెబ్బ తగిలే అవకాశం



ఎక్కువగా ఉంటుంది. అలాగే లివర్, థైరాయిడ్, రక్తనాళాల సమస్యలు ఉన్నవారు క్లాసిక్ హీట్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశం ఉంది. ఎగ్జాషన్ హీట్ స్ట్రోక్ చిన్న వయస్సువారికి సంభవించే అవకాశం ఉంది. తీవ్రమైన వ్యాయామం, క్రీడాకారులు, వేడి వాతావరణంలో శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారికి, డీహైడేషన్, శరీరం ఒత్తిడికి గురైనప్పుడు, సూర్యరశ్మికి గురైనప్పుడు ఎగ్జాషన్ హీట్ స్ట్రోక్ వస్తుంది.

**- వ్యక్తి వ్యక్తికి లక్షణాల్లో మార్పు**


వడదెబ్బ లక్షణాలు వ్యక్తి వ్యక్తికి మారుతూ ఉంటాయి. ఒళ్లు నొప్పులు, అలసట, కళ్లు తిరగడం, చెమట, అటాక్సియా, మైకము, చర్మం కందిపోవడం, వికారం, వాంతులు, అధిక దాహం, తక్కువ మూత్ర విసర్జన, గుండె వేగంగా కొట్టుకోవడం, మూర్ఛ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన సందర్భాల్లో, రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్, బ్రెయిన్ వాపు, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్, మెటబాలిక్ ఫెయిల్యూర్, నరాల దెబ్బతినడం, గుండెకు రక్త ప్రసరణ తగ్గడం, హార్ట్ ఫెయిల్యూర్, కోమాలోకి వెళ్లడం జరుగుతుంది.

**- వడదెబ్బను ఎలా నివారించాలి**

డయాబెటిస్, హైపర్‌టెన్షన్ ఉన్నవారు. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. వారి మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే... తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

**- వడదెబ్బకు గురైతే.. ఇలా చేయండి..**

ప్రథమ చికిత్సగా మెడ, ముఖంపై ఐస్ ప్యాక్ పెట్టుకోండి. ఎవరికైనా వడదెబ్బ తగిలినపుడు ఆ వ్యక్తిని చల్లని వాతావరణంలోకి తీసుకెళ్లాలి. ఒంటిపై దుస్తులను వదులుగా చేసి గాలి బాగా ఆడేలా చూడాలి. నీరు, ద్రవాహారాలను బాగా అందించాలి. కొబ్బరినీరు, చెరుకు రసాలు, పెరుగు, మజ్జిగ, పళ్లరసాలు వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తాయి. వడదెబ్బ లక్షణాలు తీవ్రంగా ఉంటే.. వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్లడం మంచిది.



## ఉగ్రవాదంపై కేంద్రం కఠినంగా వ్యవహరించాలి



**వేద న్యూస్, శాయంపేట:**

జమ్మూకాశ్మీర్‌లోని పహాల్గంపై ఉగ్రదాడి పిరికిపంద చర్య అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి దాడికి నిరసనగా మండల కేంద్రంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి దాడులతో భారతీయ స్ఫూర్తిని దెబ్బతీయలేరని అన్నారు. ఉగ్రవాదం పై కేంద్రం కఠినంగా వ్యవహరించాలని కోరారు. భారతీయులందరూ సంఘటితంగా నిలవాల్సిన సమయం అని అన్నారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు చల్ల చక్రపాణి, చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి, రఫీ, నిమ్మల రమేష్, కొమ్ముల భాస్కర్, ఐఎన్ టియుసి మండల అధ్యక్షుడు మారపల్లి రాజేందర్, రాజు, కట్టయ్య, మస్క కుమార్, జగన్, వీరన్న, వలపదాసు రాము తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్ అమిత్



**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

ప్రస్తుతం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సబ్- కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి (ఐఏఎస్) గురువారం నల్లగొండ జిల్లా రెవిన్యూ శాఖ అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్రెడిట్ కార్డ్ కాజేసి డబ్బులు వాడుకున్న వ్యక్తిపై చీటింగ్ కేసు

**వేద న్యూస్, శాయంపేట:**

క్రెడిట్ కార్డు తీసుకుని, అందులోనీ డబ్బులు కాజేసిన వ్యక్తి పై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై పరమేష్ తెలిపారు. ఎస్సై పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం శాయంపేట మండల కేంద్రానికి చెందిన గన్ను సంతోష్ క్రెడిట్ కార్డును అతనికి తెలియకుండా అందులోనీ డబ్బులను ఓ వ్యక్తి లక్ష ఆరవై ఏడు వేల రూపాయలు వాడుకున్నాడు. ఈ మేరకు గన్ను సంతోష్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఆ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## బార్ సోసియేషన్ సన్మాన కార్యక్రమాలకు దూరం




**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

న్యాయవాదుల సంఘం మిర్యాలగూడ కు జరిగిన ఎలక్షన్లలో గెలుపొందిన అసోసియేషన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నేతి సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి, ఉపాధ్యక్షులు సుండి శ్రీనివాస్,కోశాధికారి సాయికుమార్ యాదవ్ వారి కార్యవర్గం కోర్టు ప్రాంగణంలో ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఈ సభలో కార్యవర్గ సభ్యులు తమ,పర భేదములు చూడకుండా న్యాయవాదులు మాపై ఉంచిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీ సుజయ్ కుమార్ తో సహా సీనియర్, జూనియర్ న్యాయవాదులు మరియు మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. పహాల్గం సంఘటన లో మరణించిన పర్యాటకులకు శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించడం జరిగింది. అట్టి సంఘటనకు వ్యతిరేకంగా సంతాప సూచికగా ఎలాంటి సన్మాన కార్యక్రమాలు గాని శాలువాలు,బొకేలు గాని స్వీకరించకూడదని అధ్యక్ష,కార్యదర్శులు ముక్తకంఠంతో పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో గౌరు వెంకటేశ్వర్లు,లింగంపల్లి అంజయ్య, లింగంపల్లి శ్రీనివాస్, మాలి ఉమాశంకర్ రెడ్డి,గోదాల వెంకటరెడ్డి, మువ్వ అరుణ్ కుమార్,రఘురామారావు, ఇబ్రహీం,గూడూరు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రెడ్డి,పవన్ కుమార్,రెడ్డిపల్లి సైదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా స్వప్న

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణం మోత్కులగూడెం కు చెందిన తోట స్వప్న ను జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గా నియమించినట్లు మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కర్ర సత్య ప్రసన్న నియామక పత్రాన్ని పత్రాన్ని జారీ చేశారు. నియామక పత్రాన్ని హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జి వొడతల ప్రణవ్ బాబు తోట స్వప్నకు అందజేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాపై నమ్మకంతో జమ్మికుంట మండల అధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి జిల్లా మంత్రులు. పొన్నం ప్రభాకర్, దుదిల్లా శ్రీధర్ బాబు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సత్య ప్రసన్న, నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ బాబు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారిని పార్టీ అండగా ఉంటుందని పార్టీ నాపైన పెట్టిన నమ్మకాన్ని గ్రామాల్లో పార్టీని బలపేతం చేయడానికి సాయశక్తితో పనిచేస్తానని అన్నారు. మండల పరిధిలో గ్రామాల్లో గ్రామ కమిటీలు వేసి ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క కుటుంబానికి చేరే విధంగా పనిచేసి, ప్రతి కుటుంబానికి



కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందించే విధంగా పనిచేస్తానని అన్నారు.

## భూ భారతి ఆర్ఓఆర్ చట్టం పై అవగాహన సదస్సు

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూభారతి ఆర్ ఓ ఆర్ చట్టం పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత పాస్ బుక్ లలో కరెక్షన్స్ ఏమైనా ఉంటే వాటిని సరి చేసి భూభారతి చట్టం సెక్షన్ 4 కింద మళ్ళీ పాస్ బుక్ లు ఇష్యూ చేసే అధికారం ఆర్డిఓ, కలెక్టర్లకు ఉందని తెలిపారు. గతంలో అప్లై చేసుకున్న సాదా బైనామా లను ఫీల్డ్ ఎంక్వయిరీ చేసి పొజిషన్లో ఎవరు ఉన్నారో పంచనామా చేసి వారికి పట్టా పాస్ బుక్ లు అందజేస్తామని, అలాగే విరాసత్ విషయంలో 30 రోజుల కాల వ్యవధి ఉందని ఒకవేళ అన్ని సరిగా ఉండి విరాసత్ 30 రోజుల్లో కానిపక్షంలో ఆటోమేటిక్ గా అది క్లియర్ అవుతుందని అన్నారు. అలాగే గతంలో ఎప్పుడో కొనుక్కున్న భూమిని కూడా భూభారతిలో అప్లై చేసుకుంటే



- కమలాపూర్ సదస్సులో పాల్గొన్న హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

వాటిని ఎంక్వయిరీ చేసి సరైనవిగా ఉంటే పాస్ పుస్తకాలు అందిస్తామని చెప్పారు. చాలా కేసుల్లో రిజిస్టర్ డాక్యుమెంట్స్ ఉండి కూడా మ్యూటేషన్ జరగని కేసుల్లో ఆర్ఎస్ ఆర్ ఎక్స్టెంట్ మొత్తం సర్వే నెంబర్లు ఉన్న ఎక్స్టెంట్ కంటే ఎక్కువ వస్తుంటే పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వలేకపోతున్నామని, అటువంటి వారికి భూభారతి చట్టం ప్రకారం సర్వే చేసి ఆ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ప్రజలందరూ చట్టంపై అవగాహన తెచ్చుకొని ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

## బిఎస్ఎన్ఎల్ 4జీ సేవలు మరింత స్పీడ్




**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

దేశవ్యాప్తంగా టెలికాం రంగం కొత్తపుంతలు తొక్కుతున్నది. ఇప్పటికే కొన్ని ప్రైవేటు టెలికం సంస్థలు నెట్వర్క్ పరంగా 5జి సేవలు అందుబాటులోకి తెచ్చాయి. అందులో భాగంగా ప్రభుత్వ తోడ్పాటుతో నడిచే బీఎస్ఎన్ఎల్ సంస్థ 4జి సేవలను దేశవ్యాప్తంగా అందిస్తుంది. నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోనీ ఎన్ఎస్పి క్యాంపు కార్యాలయం ముందు స్టాల్స్ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్డిఈ వెంకటేష్ మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ లో 4జి సేవలను మరింత స్పీడ్ గా అందిస్తూ,కస్టమర్ లకు డేటా పరంగా సిగ్నల్ పరంగా మరింత వేగంగా అందించాలని టవర్స్ పెంచుకున్నామని,మిర్యాలగూడ నియోజక వర్గ పరిధిలో ఆడవిదేవులపల్లి, వేములపల్లి, కొండ్రాపోల్,యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్,కేశవపురం,త్రిపురారం,అంజనపల్లి పరిధిలో పూర్తిగా సిగ్నల్ వ్యవస్థ మెరుగుపర్చామని అన్నారు. కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 4జి సేవలు స్పీడ్ ను పెంచుతూ అందుబాటులోకి తెచ్చామని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ జేటివో రవి నాయక్,బిజినెస్ మోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, జేఈ సంజీవరెడ్డి,లైన్ మెన్ రామయ్య,రిటైల్ మేనేజర్ శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఏఎస్ఐకి ఏసీపీ, సీఐల అభినందన

**– పోలీస్ టెన్నిస్ పోటీల్లో 2 సిల్వర్ మెడల్స్ సాధించిన ఉమారాణి**

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట టౌన్ పీఎస్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న పల్లి ఉమారాణి. ఈ నెల 11 నుంచి 15 వరకు కేరళ రాష్ట్రంలో జరిగిన ఆలిండియా పోలీస్ టెన్నిస్ అండ్ బ్యాడ్మింటన్ గేమ్స్‌లో పాల్గొని సత్తా చాటారు. రెండు మెడల్స్ సాధించి తెలంగాణ పేరు దేశస్థాయిలో నిలబెట్టారు. టెన్నిస్‌లో డబుల్స్ విభాగంలో, మిక్స్ డబుల్ స్లోలో రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్ర పేరును నిలబెట్టిన మహిళా ఏఎస్ఐ ఉమారాణిని హుజురాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్ జి గురువారం తన ఆఫీసుకు పిలిపించి అభినందించారు. ఏసీపీ వెంట జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి కూడా ఉన్నారు.

# ఎల్కతుర్తి జంక్షన్ పనుల పురోగతి పరిశీలన

**వేద న్యూస్,ఎల్కతుర్తి :**



ఎల్కతుర్తి జంక్షన్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కుడా చైర్మన్/ బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే కుడా అధికారులను ఆదేశించారు. ఎల్కతుర్తి బస్ స్టాండ్ సమీపంలో ప్రధాన కూడలిని వైస్ చైర్మన్ గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించి జంక్షన్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని వేగవంతంగా పూర్తి చేయడానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ వరంగల్ సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు ఈ కూడలి తలామానికంగా నిలిచేలా పెద్ద విస్తీర్ణంలో జంక్షన్ ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, ఇప్పటికే 80శాతం సివిల్ పనులైన మిగిలిన ఐలాండ్, సెంట్రల్ మీడియన్ పూర్తి కావడం జరిగిందని, మిగిలిన ఫుర్నిషింగ్, గ్రీనరీ పనుల ను వేగవంతంగా పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈ ఈ భీమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లు కేటాయించే వరకు దీక్ష విరమించేదే లేదు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



**– వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు**

జర్నలిస్టుల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే వరకు నిరాహార దీక్ష విరమించేదే లేదని వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకై తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు దేశాయిపేట లక్ష్మీ మెగా టౌన్షిప్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ముందు చేపట్టిన నిరాహార దీక్ష గురువారానికి 11వ రోజుకు చేరుకుంది. కాగా ఈ దీక్ష శిబిరాన్ని గురువారం సామాజిక కార్యకర్తలు, పలువురు సందర్శించి సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులు చేపట్టిన న్యాయ పోరాటానికి తమ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

# పార్టీ కోసం పనిచేసిన వారికి అండగా ఉంటాం

**– మడిపల్లి సుశీల్ గౌడ్ నివాసానికి ఎమ్మెల్సీ కవిత – కుటుంబ సభ్యుల బాగోగులు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ**

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



భారత రాష్ట్ర సమితి రజతోత్సవ ఏర్పాట్లను పరిశీలించడం కోసం ఎమ్మెల్సీ కవిత వరంగల్ లో పర్యటించారు. ఈ సందర్భంగా భద్రకాళి అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం పోచమ్మ మైదాన్ లోని భారత జాగృతి అధికార ప్రతినిధి మడిపల్లి సుశీల్ గౌడ్ నివాసానికి వెళ్లారు.అక్కడ వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. వారి బాగోగులు అడిగి తెలుసుకొన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# ముళ్ళ కంచెలు ఏర్పాటు చేయండి

**– గ్రీన్ ల్యాండ్స్ ఆక్రమణల నియంత్రణకు -బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

వరంగల్ నగర పరిధి లోని గ్రీన్ ల్యాండ్స్ ఆక్రమణల నియంత్రణకు ఇనుప ముళ్ళ కంచె లు ఏర్పాటు చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బల్దియా పరిధిలోని ఎల్లాపూర్ లో జీడబ్ల్యూ ఏంసి నిర్వహిస్తున్న నర్సరీని కమిషనర్ గురువారం ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించ డానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వన మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకొని నగర పరిధిలోని 12 నర్సరీల్లో 10 లక్షల మొక్కలను లక్ష్యంగా పెట్టుకొని పెంచడం జరుగుతుందని, ప్రధానంగా పండ్లు, పూల మొక్కలను పెంచేలా ఆదేశించడం జరిగిందని అన్నారు. వేసవి కాలం నేపథ్యంలో ఎండలు గరిష్ట ఉష్ణోగ్రతలను చేరుతున్న క్రమంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు దఫా లుగా నీటిని అందించి మొక్కలను ఎండిపోకుండా కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. నగర పరిధిలోని గ్రీన్ ల్యాండ్స్ ఆక్రమణలకు గురికాకుండా టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయం చేసుకుంటూ గ్రీన్ ల్యాండ్స్ చుట్టూ ముళ్ళకంచెను (ఇనుముతో చేసిన) ఏర్పాటు చేసి సంరక్షించాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పొరపాటున సరిహద్దు దాటిన బీఎస్ఎఫ్ జవాన్



**వేద న్యూస్, డెస్క్:**

సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్ పొరపాటున సరిహద్దు దాటాడు. పాకిస్థాన్ రేంజర్లు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బీఎస్ఎఫ్ జవాన్ విడుదల కోసం ఇరు దేశాల మధ్య సైనికపరంగా చర్చలు జరుగుతున్నాయి. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సరిహద్దులో ఈ సంఘటన జరిగింది. బుధవారం అక్కడ విధులు నిర్వహిస్తున్న 182వ బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పీకే సింగ్ రైతులతో కలిసి చెట్టు నీటలో విశ్రాంతి తీసుతీసుకునేందుకు ముందుకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ రేంజర్లు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ జవాన్ వద్ద ఉన్న సర్వీస్ రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. తమ ఆధీనంలో ఉన్న బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పీకే సింగ్ ఫొటోను విడుదల చేశారు.

కాగా, బీఎస్ఎఫ్ దీనిపై స్పందించింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పీకే సింగ్ విడుదల కోసం ఇరు దేశాల బలగాల మధ్య ఫ్లాగ్ మీటింగ్ జరుగుతున్నదని ఆర్మీ అధికారులు తెలిపారు. ఇలాంటి ఘటనలు సాధారణమేనని చెప్పారు. ఇరు దేశాల సైనికులు పొరపాటున సరిహద్దులు దాటిన సంఘటనలు గతంలో కూడా జరిగినట్లు వివరించారు.

మరోవైపు పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ కఠిన నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఆంక్షలు విధిస్తున్నది. ఈ తరుణంలో బీఎస్ఎఫ్ జవాన్‌ను పాక్ రేంజర్లు అదుపులోకి తీసుకోవడం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది.

# పాక్‌ను ఒంటిరిని చేసేలా మద్దతును కూడగడుతున్న భారత్

**వేద న్యూస్, డెస్క్:**

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో జర్మనీ, జపాన్, పోలాండ్, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, ఖతర్‌తో సహా అనేక దేశాల రాయబారులతో విదేశాంగ మంత్రిత్వ శాఖ సౌత్ బ్లాక్‌లోని కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించింది. పహల్గాం దాడి ఘటన ఆయా దేశాల రాయబారులకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ వివరించారు. పాక్ అండతో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డ తీరును ఆయా దేశాలకు వివరించి.. దాయాది దేశాన్ని ఏకాకిని చేసేదిశగా కేంద్రం రాయబారులతో సమావేశం ఏర్పాటు చేసింది. ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్‌ను ఎండగట్టేందుకు.. ఉగ్రదాదుల దాడిని ప్రపంచదేశాలకు వివరించే ప్రయత్నం చేసింది. చైనా, కెనడాతో సహా జీ20 దేశాలు, ఎంపిక చేసిన దేశాల రాయబారులకు పహల్గాం ఉగ్రవాద దాడి గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరించింది. సమావేశం దాదాపు 30 నిమిషాల పాటు కొనసాగింది.

# సివిల్స్ పరీక్షల్లో జయకేతనం ఎగరవేసిన సాయి శివాని



**– హర్షం వ్యక్తం చేసిన బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వేద న్యూస్, వరంగల్:**

సివిల్స్ లో సత్తా చాటిన తెలుగు తేజం వరంగల్ జిల్లా శివనగర్ ప్రాంతానికి చెందిన ఇట్టబోయిన సాయి శివాని ఆల్ ఇండియా 11వ ర్యాంక్ సాధించిన సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లితండ్రుల ప్రోత్సాహంతో పాటు అలుపెరుగని దీక్ష పట్టుదలతో మీరు సాధించిన ఈ అసాధరణ విజయం ఎంతోమంది యువతీ యువకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భవిష్యత్తులో అత్యున్నత సర్వీసులో పేద ప్రజల కోసం పనిచేసి దేశానికి మంచిపేరు తీసుకురావాలని, రాజకీయ నాయకులు ఐదేళ్లే పదవిలో ఉంటారని కానీ మీరు ఎక్కువకాలం సేవచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంతోమంది యువతీ యువకులకు స్ఫూర్తి అన్ని రంగాల్లో మనవారు ఇలాగే ఎదగాలని మనసూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలి

**వేద న్యూస్, వరంగల్ :**




యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే చెల్లింపులు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 184 కొనుగోలు కేంద్రాలకు గాను 179 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 22 వేల 624 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరుతోకోతలు లేకుండా కొనుగోలు చేయు విధంగా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు నీడ కొరకు షామియానా, తాగునీరు, ప్యాడి క్లీనర్, మాయిశ్చర్స్, తూకపు యంత్రాలు, టార్పాలిన్లు, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యం విడి విడిగా కొనుగోలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. మిల్లులకు సరఫరా చేసే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ తప్పనిసరి అని కలెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, డిసిఎస్ఓ కిష్టయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 25, 2025



## లైబ్రరీలో అన్న ప్రసాద వితరణ

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణ మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కుర్ర విష్ణు 54 వ జయంతి సందర్భంగా గురువారం ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. స్థానిక గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధికార ప్రతినిధి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నవితరణ చేసి కుర్రవిష్ణుకి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగార్జున చారి, ఇలియాస్ ఖాన్,ముగ్ధుం పాషా,యువజన విభాగం నుండి శ్రీకాంతచారీ, షోయబ్, గంగుల బిక్షం తదితరులు పాల్గొని ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవితమంతా పేద ప్రజలకు అండగా నిలిచి నిత్యం వారి ఉన్నతి కోసం ఎంతో శ్రమించి మరెందరినో నాయకులను తీర్చిదిద్ది రాజకీయ అవకాశం కల్పించిన నిస్వార్థ సేవా తత్పరుడు శ్రీ విష్ణు అని కొనియాడారు.వారు లేని లోటు తీర్చలేనిదని,పార్టీకి వ్యక్తిగతంగా తమందరికి ఎంతో నష్టమని, వారు చూపించిన మార్గంలో పయనిస్తూ వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ శక్తిమేరకు కృషి చేయాలని అప్పుడే వారి పవిత్రాత్మకు శాంతి కలుగుతుందని తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసిన శ్రీనివాస్ యాదవ్ ను ఆదర్శంగా తీసుకోవాలి అని కొనియాడారు.

## ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టి పెల్లి సైదులు

**వేద న్యూస్, మోతే :**



జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గం ప్రాంతంలో పర్యాటకులపై దాడి చేసి 26 మందిని చంపిన ఉగ్రవాదుల చర్యలను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.ఈ దాడిని దేశ ప్రజానికమంతా ముక్తకంఠంతో ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జమ్ము కాశ్మీర్ లోని పహాల్గాం పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి వెళ్లిన 26 మంది పర్యాటకులను విచక్షణరహితంగా దాడి చేసి తుపాకులతో కాల్చి చంపిన ఉగ్రవాదుల చర్యలను దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఇది పిరికిపందల చర్యగా అభివర్ణించారు.ఈ దాడిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉందని మరి కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగి వసుదైక కుటుంబ భావన కలిగిన భారత దేశంలో ఇటువంటి విద్వేష విభజన రాజకీయాలను దేశం ఏనాటికి అంగీకరించదని అన్నారు. పరస్పర సహకారం సహనంతో ప్రపంచ అభివృద్ధి జరుగుతుందే తప్ప ప్రజల ఆచారాలు సాంప్రదాయాలు ఆహార అలవాట్లపై ద్వేషం పెంచుకోవడం వల్ల ఒనగూరేది ఏమీ లేదని అన్నారు. పర్యాటకులపై జరిగిన ఉన్మాద చర్యలకు వ్యతిరేకంగా బాధిత కుటుంబాలకు అండగా దేశ ప్రజానీకం నిలబడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా సహాయం అందించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఆర్మీలో రెండు లక్షల పైగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి దేశ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ ప్రజలు ఐక్యతతో దుశ్చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

## పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో బిగ్ రిలీఫ్

**వేద న్యూస్, హైదరాబాద్:**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఎమ్మెల్యేను అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సోమవారం వరకు కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయవద్దని న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగించవచ్చని, పోలీసులకు సహకరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. క్వారీ యజమాని మనోజ్‌ను రూ.50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించాడంటూ పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు అయ్యింది.

మనోజ్ భార్య ఉమాదేవి సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎమ్మెల్యేపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కేసును కొట్టివేయాలంటూ కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పిటిషన్‌పై ఈరోజు (గురువారం) హైకోర్టులో విచారణ జరిగింది. రాజకీయ కక్ష్యల కారణంగానే కేసు నమోదు చేశారని కౌశిక్ రెడ్డి న్యాయవాది కోర్టులో వాదించారు. 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ఉన్నాయని తెలిపారు.

కమలాపూరం మండలం వంగపల్లిలో క్వారీ నిర్వహిస్తున్న మనోజ్ 2023 అక్టోబర్ 25న 25లక్షల రూపాయలు కౌశిక్ రెడ్డికి మనోజ్ చెల్లించినట్లు వాంగ్మూలం ఉంది కదా అని పీపీని హైకోర్టు ప్రశ్నించింది. అయితే బెదిరించడంతోనే రూ.25 లక్షలను కౌశిక్ రెడ్డికి మనోజ్ చెల్లించాడని పీపీ వెల్లడించారు. ఇప్పుడు రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పీపీ పేర్కొన్నారు. 2023లో ఎందుకు ఫిర్యాదు చేయలేదని పీపీని ప్రశ్నించిన న్యాయస్థానం ప్రశ్నించింది. అలాగే తదుపరి విచారణ వరకు కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని ఆదేశించింది ధర్మాసనం. తదుపరి విచారణను ఈనెల 28 వరకు హైకోర్టు వాయిదా వేసింది.







# అలరించిన లలిత సంగీత విభావరి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**





నూతన గాయనీ గాయకులచే కేవలం సినీ సంగీతమే కాకుండా భారతీయ సాంప్రదాయ కళ అయిన లలిత సంగీతాన్ని పాడిస్తూ అందరి ఆదరణ పొందుతున్న "స్వరరాగ పల్లకి" దినదిన ప్రవర్ధమానం కావాలని జన రంజని గ్రూప్ అధ్యక్షులు కొండపల్లి రామ్ కిషన్ రావు అన్నారు. కళా సుబ్బారావు కళావేదిక త్యాగరాయ గాన సభలో జరిగిన స్వరరాగ పల్లకి లలిత గీతాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ కార్యక్రమా నిర్వాహకులు కట్టెకోల జయంత్ కుమార్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అద్భుతంగా ఉంటాయని ఆయన కితాబు ఇచ్చారు. గతంలో సుమారు 6, 7, కార్యక్రమాలు లలిత సంగీత కార్యక్రమాలు ప్రేక్షకులకు అందించడం జరిగిందని ఈ నేపథ్యంలో "కళ్ళు" సినిమా ఛాయాగ్రహకులు రఘు, తదితరులను సన్మానించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో స్వరరాగ పల్లకి ఎందరో నూతన కళాకారులకు వేదికలు అందజేయాలని సూచించారు. లలిత సంగీతానికి ప్రత్యేకంగా కరవోకే తయారు చేయడం అద్భుతమని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు గాయకులు కట్టెకోల జయంత్ కుమార్ మాట్లాడుతూ సినీ సంగీతం ప్రతి చోటా వినిపిస్తుందని కానీ అలనాటి గాయని గాయకులు ఘంటసాల లీల పి బి శ్రీనివాస్, కే బి కే మోహన్ రాజు లాంటి ఎంతోమంది గాయకులు పాడిన లలిత గీతాలను గాయని గాయకులతో పాడిస్తూ స్వరరాగ పల్లకి ముందుకు సాగుతుందని అన్నారు.

లలిత సంగీత గీతాలను జ్యోతిర్మయి నల్లనివాడా నీ పిల్లనగ్రోవి అని పాడితే, నాగ బండి శ్రీనివాసరావు స్నేహమేరా జీవితానికి వెలుగునిచ్చే వెన్నెల అన్నారు. స్నేహలత నాకంటూ లలిత గీతాన్ని ఆలపిస్తే కట్టెకోల జయంత్ పాట పాడవ కృష్ణ అని పాడారు. పాండురంగరాజు పసిడి కిన్నెర వీణ అని పాడితే జ్యోతిర్మయి పాండురంగరాజు తో కలిసి కనులకు తోడునీడగా అన్నారు. శోభా లతా గోరువెచ్చని గుండెలో అని పాడితే పాండురంగరాజు తల నిండా పూదండ దాల్చిన రాణి అని పాటను ఆలపించారు. గాయని విశ్రాంత ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి మధుర నగరి సమీపంలో అనే పాట పాడి అలరించారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా సూర్యాపేట జిల్లా ఉత్తమ విశ్రాంత ఉపాధ్యాయుని పాలకుర్తి విజయలక్ష్మి కార్యక్రమం ఆసాంతం అద్భుతంగా నిర్వహించగా లలిత సంగీతానికి ప్రత్యేకంగా కరవోకే సమకూర్చిన పాండురంగరాజు నిర్వాహకులచే అద్భుత సన్మానాన్ని అందుకున్నారు.

# 139వ మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**వేద న్యూస్,ఎన్టీపీసీ జ్యోతి నగర్:**




ఎన్టీపీసీ ఐఎఫ్‌టియు కార్యాలయంలో గురువారం 139వ మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు చిలుక శంకర్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచ కార్మిక వర్గం చరిత్రలో మేడే యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఐరోపాలో పెట్టుబడి దారీ వ్యవస్థ ప్యూడలిజాన్ని తుడిచి పెట్టి పారిశ్రామిక విప్లవానికి కార్మిక వర్గం ముందుం డిందని, అదే సమయంలో కార్మికుల జీవితాలు యాంత్రి కంగా మారాయని తెలిపారు. 8 గంటల పని హక్కు కోసం అమెరికాలో కార్మికులు చేసిన చారిత్రాత్మక పోరా టం- చికాగో 1886 ఉద్యమాన్ని గుర్తు చేస్తూ, మేడే ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం జరిగిన ఉద్యమాలు స్ఫూర్తిదాయకమని అన్నారు.

ప్రస్తుతం నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మిక హక్కులపై దాడి జరుగుతుందని, కార్మిక చట్టాలను కార్పొరేట్ లాభాల కోసం చట్టం అమలులోనుండి మినహాయిస్తున్నారని ఆరోపించారు. ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ, జిందాల్, అదానీ, అంబానీ వంటి కంపెనీలు వారానికి 70-90 గంటల పని దినాల పట్ల మొగ్గుచూపుతున్నాయని, ఇది మానవ శ్రమను దుర్వినియోగం చేసే ప్రయత్నమన్నారు.కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో పని గంటలు తగ్గించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, దానికి విరుద్ధంగా కార్మికులపై ఒత్తిడి పెడుతున్నారని అన్నారు. బ్రూట్ మెజారిటీ ఆధారంగా మోడీ ప్రభుత్వం కరోనా కాలంలో లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని, ఇవి అమలయ్యే పరిస్థితుల్లో కార్మికులు తాము కలిగిన హక్కులను కోల్పోతారని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం వత్తిడి తీసుకురావడాన్ని విమర్శిస్తూ, కొన్ని రాష్ట్రాలు అమలుకు నిరాకరిస్తే మరి కొన్ని షరతులతో ముందుకెళ్తున్నాయని తెలిపారు. అలాగే అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి దయనీయమని, స్కీం వర్కర్లను కనీసం కార్మికులుగా కూడా గుర్తించకపోవడం అన్యాయమన్నారు.సామాజిక ఉద్యమాలను అణిచివేయడం, ప్రశ్నించే గొంతులను మూడిపట్టి మతోన్మాద నినాదాలతో విభజనకు పాల్పడుతున్న ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని విమర్శించారు. వక్ఫ్ ఆస్తుల్ని, ఖనిజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.చివరగా, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి మునుపటి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్, స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, గ్లోబల్ పెట్టుబడులను నియంత్రించాలే గానీ, గ్లోబల్ శ్రమను కాదు అనే డిమాండ్లపై 139వ మేడే సందర్భంగా ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ పిలుపునిచ్చిందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు బి. బుచ్చన్న, జి. కుమార్, గుండు రాజయ్య, పి. రమేష్, జె. కృష్ణ, బి.టి. రెడ్డి, జె. సందీప్, ఓ. మనోహర్, జి. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## పక్షుల దాహన్ని తీర్చడానికి నీటి తొట్టి బాక్సులు ఏర్పాటు

**వేద న్యూస్, కోదాడ :**

కోదాడ పట్టణంలోని పీఎం శ్రీ జడ్పీ బాలుర హైస్కూల్ లో గురువారం వేసవి కాలంలో పక్షుల దాహన్ని తీర్చడానికి పక్షులకు చిన్న చిన్న "నీటి నిల్వ తొట్టి బాక్సులు"ను ఏర్పాటు చేయడం జరిగింది. కోదాడ మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి. సలీం షరీఫ్ పాల్గొని మాట్లాడినారు. పక్షులు పట్ల దయ కరుణ కలిగి ఉండి ప్రకృతి ప్రేమికులుగా ఉపాధ్యాయులు వేసవికాలంలో దాహన్ని తీర్చుటానికి వినూత్నంగా నీటి సదుపాయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల నడుస్తున్నప్పుడు ఆహారం నీటి కోసం అలవాటైన పక్షులు పాఠశాలకు 24వ తేదీ నుండి వేసవి సెలవులు ఇవ్వడం వలన ఇబ్బంది కలగకుండా ఇలాంటి ఏర్పాట్లు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి.మార్కండేయ, ఉపాధ్యాయులు దేవరాజు, కాజామియా,బడుగుల సైదులు,శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## హవాలా వ్యాపారులపై ఈడీ దాడుల కలకలం..

**వేద న్యూస్, హైదరాబాద్:**

హైదరాబాద్‌లో మరోసారి ఈడీ దాడులు కలకలం రేపుతున్నాయి. ఏకకాలంలో ఏకంగా 13 మంది హవాలా ఆపరేటర్లపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, గతంలోనూ దేశవ్యాప్తంగా హవాలా వ్యాపారులపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఢిల్లీ, జైపూర్, బెంగాల్, కోల్‌కతాలోనూ దాడులు చేశారు. తనిఖీల్లో భారీ మొత్తంలో హవాలా డబ్బుని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ, కోటి, బషీరాబాగ్ ప్రాంతాల్లో హవాలా సొమ్ము పెద్ద మొత్తంలో పట్టుబడ్డింది. అయితే హైదరాబాద్‌లో హవాలా నడిపిస్తున్న వ్యక్తులే టార్గెట్‌గా ఈ దాడులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో నగరంలో హవాలా కేసులో పట్టుబడిని నిందితుల లిస్ట్ ఆధారంగా ఈడీ అధికారులు దాడులు చేస్తున్నారు.





# ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

**వేద న్యూస్, కోదాడ :**

జమ్మూకాశ్మీర్‌లోని పహల్ గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ గురువారం కోదాడ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపి ఉగ్రదాడుల్లో మరణించి వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.రామకృష్ణ మాట్లాడుతూ అకారణంగా అమాయక టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి జరపడం ఖండించాలని కోరారు. ప్రశాంత జమ్మూకాశ్మీర్ లో పెరిగిన టూరిజంను దెబ్బతీయడానికి ఉగ్రవాద మూకలు వికృతంగా వ్యహరించారన్నారు.ఉగ్రవాదుల దాడులలో మరణించిన మృతుల కు ఘన నివాళులు అర్పించి, వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య,జాయింట్ సెక్రటరీ నయీమ్,కోశాధికారి కోదూరు వెంకటేశ్వరరావు,లైబ్రరీ సెక్రటరీ బండారు రమేష్, సీనియర్ న్యాయవాదులు, మేకల వెంకటరావు,పాలేటి నాగేశ్వర రావు, వేజల్ల రంగారావు,రంజాన్ పాషా,శరత్ బాబు, ఈదుల కృష్ణయ్య,రామిరెడ్డి, గట్ల నర్సింహారావు,బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, వి.ధనలక్ష్మి, హుస్సేన్, సామ నవీన్, ఎస్‌విచలం, కె.మురళి, కరీం,ఎం.రాజారాం, ఎం.రామకృష్ణ,ముల్క వెంకటరెడ్డి, దావీదు, నాగుల్ మీరా, హేమలత, బెల్లంకొండ గోవర్ధన్, పెద్దబ్బాయ్, రాజు,కె.శరత్ కుమార్ పాల్గొన్నారు.

### మెట్ పల్లి న్యాయవాదుల విధుల బహిష్కరణ

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :** జమ్మూ కాశ్మీర్ లోని పర్యాటకులపై ఉగ్రదాడి కి నిరసనగా మెట్ పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులకు దూరంగా ఉన్నారు. న్యాయస్థానం ప్రధాన ద్వారం వద్ద నిరసన చేపట్టి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదలు చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ దాడులకు పాల్పడ్డ ఉగ్రవాదుల్ని కఠినంగా శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకువాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, జాయింట్ కార్యదర్శి గజేల్లి రాందాస్, క్యాసియర్ పడిగేల శ్రీనివాస్, ఎజిపి అబ్దుల్ హాఫీజ్, సీనియర్ న్యాయవాదులు రాజ్ మహ్మద్, జిల్లా వెంకటేశ్వర్లు, వడ్డేపల్లి శ్రీనివాసన్, బోడ లక్ష్మణ్, బద్దం లక్ష్మారెడ్డి, గడ్డం శంకర్ రెడ్డి, పుప్పాల భానుమూర్తి, ఎలాల మధుసూదన్ రెడ్డి, ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, చిప్ప జనార్దన్, రాజేష్ శెట్టి, బర్ల సంతోష్, మగ్గిడి హరిభూషన్, మన్నె గంగాధర్, గురిజెలా గోపి, అశోక్, వెంకటేష్, అనిరుద్, శంకర్, రమణ, వేణు, చైతన్య, నవీన్, చిరంజీవి పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073